
# కారణం

తమిళ మూలం: పా. రాఘవన్

అనువాదం: సి.హెచ్. శ్రీనివాస మూర్తి

పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంటు ముఖ్య కార్యాలయమంటే, ప్రజల పనులు సాధారణంగా నత్తనడక నడిచే చోటు. ఎత్తయిన సీలింగ్ ఫాన్‌లు, తెరచిన కిటికీలు, సముద్రపు గాలులకు రెపరెపలాడే కాగితాలు, 'కాఫీ'లంటూ చీటికి మాటికి టేబుళ్ల చుట్టూ తిరిగే బంట్రోతులు, కమల్‌హాసన్ సినిమాలు ఏకరువు పెట్టే టైపిస్ట్, సెక్షన్ ఆఫీసర్ గారి గార్ధభ కంఠం, అసిస్టెంటుగారి రేసు కోర్సు కబుర్లతో అలరారుతుంటుంది.



సేతురామన్ పెన్నుకిందబెట్టి వేళ్ళు విరుచుకున్నాడు. అతనికీ మాసిన ఎర్ర భవంతిలో మొదటిరోజు. అతనక్కడికి ట్రాన్స్‌ఫర్ అయి కొత్తగా జాయినయ్యాడు.

''మీట్ మిస్టర్ సేతురామన్...'' అసిస్టెంట్ తర్వాత అసిస్టెంటుకు అతన్ని పరిచయం చేయటం అతనికి విసుగ్గా ఉంది. కాని క్యాషియర్ సీటు దగ్గరికొచ్చేసరికి అతను..చెంపచెళ్ళుమనిపించినంతగా షాక్ చెందాడు.

''ఈమె ప్రియ. ప్రతినెలా మనజీవనాధారమ్మైన జీతాలందించే దేవత..''

అతను ఆమెను చూసి అవాక్కయ్యాడు.

''సారీ ప్లీజ్. నాకూతురుకు ఈ సంబంధం నచ్చలేదు. మీరు మరోలా అనుకోవద్దు...'' తనలో తనే గొణుక్కుంటున్నట్లుగా చెమటలు కక్కుతూ ప్రియ తండ్రి చెప్పినమాటలు మనసులో మెదిలాయి.

''ఇడియట్... అమ్మాయి

నచ్చిందని ముందే డిక్లేర్ చేయమని ఎవరు చెప్పారు. ఇప్పుడు చూడు.. ఆ అమ్మాయి నువ్వు నచ్చలేదని తెగేసి చెప్పింది చెప్పుతో కొట్టినట్టు. ఇప్పుడు మన తల ఎక్కడపెట్టుకోవాలి? సంబంధం కుదురుతుందా లేదా అన్నది చాలా మామూలు విషయం. కానీ ఇటువంటి సమయంలో మగవాని తరపువాళ్ళం. మన బెట్టు పోగొట్టుకోవడమెందుకు? ఆమె తన అభిప్రాయం చెప్పిన తర్వాతనే మన విషయం చెప్పొచ్చుగదా. నేను పురుషాహంకారిలా మాట్లాడటంలేదు. ఇప్పుడీ అవమానం మనమే భరించాల్సొచ్చింది గదా..'' నాన్న పెట్టదల్చుకున్న నాలుగు చీవాట్లు పెట్టి బయటికి వెళ్ళిపోయాడు.

'అవమానం' అనే పదం కొద్దిగా కటువుగానే తోచింది సేతురామన్‌కు. తను ఇంతవరకూ ఆ విషయం ఆలోచించనే లేదు. ఒక ఆడపిల్ల, కుర్రాడు తనకు నచ్చలేదని చెప్పటం మగవాడికి అవమానమా? తను అమ్మాయి నచ్చలేదని చెపితే? సమాజ న్యాయం ప్రకారం అదా అమ్మాయికి అవమానంకాదు. అతి సాధారణమైన విషయం. మరో సారి పెళ్ళి కుదరకపోవటం. అంతే.

కాని ఎందుకో ఆ అమ్మాయిని చూసిన తర్వాత 'నో' అనాలనిపించలేదు సేతురామన్‌కి. ఆమె పెద్ద అందగత్తెకాదు. విద్యాధికురాలా అంటే అదీ కాదు. ఆస్తిపరులు అంతకంటే కాదు. మామూలు మధ్య తరగతి కుటుంబం. నెలవారీ చీటీలు, సరుకుల దుకాణంలో అప్పులు, బ్లాక్ అండ్ వైట్ టీవీ వగైరా వగైరాల సాధారణ జీవితం. ఆమె అతను పని చేసే డిపార్ట్‌మెంటులోనే పని చేస్తుంది. జీతంలో కూడా అట్టే తేడా లేదు. చదువులో యిరువురూ సమానమే. ఇవన్నీ కూడా తనకు అనుకూలమైన విషయాలేననిపించాయి. అందుకనే తన మనసులోని మాటను అక్కడే అప్పుడే చెప్పేశాడు. కాని తన తండ్రి మాత్రం ముందుగా తన అభిప్రాయం చెప్పటం తప్పని తేల్చాడు.

''లేడీస్ ఫస్ట్ అని ఎందుకన్నారో తెలుసా? ఆడవాళ్ళకు గౌరవమివ్వటానికనుకుంటున్నావా. కానే కాదు. ఎవరో, ఎప్పుడో ఇలాగే దెబ్బతినుంటాడు. అందుకని అతనే ఈ సూత్రాన్ని కనిపెట్టి ఉంటాడు. తను సేఫ్‌గా ఉండటానికి''– అని అన్నాడు తండ్రి. ఆయన తన అభిప్రాయాలే సరైనవనే మనిషి. అందుకని ఆయన మాటలను అంతగా పట్టించుకోవాల్సిన అవసరంలేదు. కాని గాయపడిన అతని అహానికి కావల్సింది సలహాలు. సాంత్వనలు కావు. అతని ఏకాంతానికి అతన్ని వదలటమే. కానీ అతని మానాన అతణ్ణి వదిలిపెట్టలేదు ఇంట్లో.

''ఆ తల బిరుసు పిల్లను గూర్చి ఆలోచించాల్సిన పని లేదు. అంతకంటే అందమైన, ఆస్తిపరురాలైన గొప్పింటిపిల్లను, అణకువ గల్గిన పిల్లను తెచ్చి సలక్షణంగా పెళ్ళి చేస్తా'' నని ప్రతిజ్ఞచేసింది అతని తల్లి. ఆ మాటలని కొంగుకొనను బొడ్లో దోపి పక్కింటికి బయలుదేరించి మరి కొంతమంది సానుభూతిని సంపాదించటానికి. ''నాకొడుక్కేం తక్కువ? కన్నొంకరా? కాలొంకరా?' అంటూ ఏకరువు పెట్టటానికి. ఇదంతా అతనికి మరింత చికాకు కలిగించింది.

''అనవసరంగా గోరింతను కొండంత చేస్తావెందుకు?'' అని తల్లిని కొద్దిగా కటువుగానే మందలించాడు. ''చేసిన నిర్వాకం చేసి నామీద ఒంటికాలి మీద లేస్తావెందుకు?'' అంటూ దెప్పిపొడిచింది.

ఈ రభసనుండి మానసికంగా కొంతైనా ఉపశమనం దొరికితే బాగుండుననుకునే సమయంలోనే అతనికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ చేతికందింది, హెడ్డాఫీసుకు మారుస్తూ. బతుకుజీవుడా అంటూ సామానంతా సర్దేసుకుని ఆ రోజే ఊరొదిలాడు. కాని విధి వెక్కిరించిన కారణంగా ఆమె కూడా బదిలీ మీద హెడ్డాఫీసు చేరింది. అతనికి కొంతలో కొంత తృప్తి కలిగించిన విషయమేమిటంటే.. ఆమె సీటు దూరంగా ఉండటం. ఇతనిది ఈ మూలైతే ఆమెది ఆమూల. ఎదురెదురుగా కూర్చోవాల్సిన అవసరం తప్పింది. ఒకరినొకరు చూడాలంటే కొంగలా మెడలు వంచి ప్రయత్నిస్తే తప్ప సాధ్యంకాదు. ఆమెని పదినిముషాలకొకసారి మెడవంచి ఆమె వైపు చూడకుండా ఉండలేకపోయాడు, అయిష్టంగానైనా అటువంటి సమయాల్లో అతని గుండెలో ముల్లులా మెదిలే ప్రశ్న ఒక్కటే. ఆ పిల్ల తనను ఎందుకు తిరస్కరించింది?

ఆమె ఎప్పుడైనా అతనుండే వైపు చూస్తూ, ఆడవాళ్లతో మాట్లాడుతుంటే అతనికి అనుమానమేసేది. ''చూడు. అక్కడ కూర్చున్నాడే. ఆయన తన బంధువులనందర్నీ వెంబడేసుకుని పెళ్లి చూపులకొచ్చాడు. నేను నచ్చలేదని మొఖం మీదనే చెప్పాను'' అని చెప్తున్నట్లు భావించేవాడు.

అవసరం కొద్దీ , ఆమె చేతిలో ఫైలుతోనో, వోచర్ ప్యాడ్ తోనో తన పక్కనున్న సీట్లదగ్గరికొస్తే అతనికి అనవసరంగా గాభరా కలిగేది. ఆమె తిరిగి వెళ్ళిపోయేంత వరకు ఇబ్బందిగా ఫీలయ్యేవాడు.

ఒక్కోమారు అనాదినుండి అలవాటైన పురుషాహంకారం పడగెత్తేది. మగవాడెవడైనా ఇది సహించగలడా? కానీ ఈ 'ఇగో' ఎక్కువకాలం నిల్చేది కాదు. మధ్యతరగతి మానవుడి 'ఇగో'లు అట్టే నిలవవు. అయితే అది ఆత్మనింద రూపంలోకి మారుతుంది.

తన బ్రహ్మచారి గదిలో, ఆదివారాలు, మధ్యాహ్నం అన్నం తిని, మంచం మీద నడుము వాల్చినప్పుడు, ఆఫీస్ కేంటిన్‌లోనో, పచ్చిక ఎత్తుగా మొలచిన బీచి దగ్గరో ఆమెతో సంభాషించినట్లూహించేవాడు. అనుకోకుండా ఒకరికొకరు తారసపడినట్లు అనుకునేవాడు.

''అయాం సారీ!'' ఆమే ముందు అనేది. అంతే. ఆ సమయంలో ఆమె పట్ల ఎలాంటి కోపమూ ఉండేది గాదు. తన 'ఇగో' కూడా మాయమయేది. అరిషడ్వర్గాలను అధిగమించిన సర్వసంగపరిత్యాగిలా దృఢ, శాంతమైన మనస్సుతో అనేవాడు.

''నాకేం బాధ లేదు. ఎవరికైనా తన అభీష్టం మేరకు తమ అభిప్రాయం వెలిబుచ్చే హక్కు ఉంటుంది. కాని దానికి సహేతుకమైన కారణం చూపించాల్సిన అవసరముంటుందని నీకు తెలుసు గదా. నీవు ఆ కారణం చెప్పి ఉండాల్సింది. నేనేమీ అనుకునేవాణ్ణి కాదు...'' అని.

అతని గొప్ప సంస్కారాన్ని చూసి ఆమె తల దించుకుంటుంది. బంగాళాఖాతం వెనకవైపునుండి రోదిస్తుంటుంది. కనుకొనలనుండి రెండు కన్నీటి బొట్లు రాలటానికి సిద్ధంగా ఉంటాయి.

తను, లోపల్లోపలే రగులుతున్న కోపాన్ని నియంత్రించుకుంటూ..''ప్లీజ్. ధైర్యం చిక్కబట్టుకోండి...'' అంటుంది.

అంతలోకి అతన్ని నిద్రాదేవి ఆవహించేది.

మరుసటిరోజు ఆఫీసులో ఆమెను చూడగానే, తనూహించుకున్న సంభాషణలు ఎందుకూ పనికి రాకుండా పొయ్యేవి. గంభీరమైన నిశ్శబ్ద తాండవం చేసేది. రోజంతా అవమానభారంలో మునిగి నెమ్మదిగా సాయంత్రం ఇల్లు చేరేవాడు.

పదిరోజులు గడిచాయి. ఆమెతో కనీసం ఒక్కసారి కూడా మాట్లాడలేకపోయాడు. ప్రయత్నపూ



ర్వకంగా ఆమెను తప్పించుకు తిరిగేవాడు. ఒక్క సారి మాత్రం తను సెక్షనాఫీసర్ గారి రూంలోకి వెళ్ళినప్పుడు, ఆయన క్యాషియర్ మేడంను పిలవ మని పురమాయిస్తే, ఆమె టేబుల్ దగ్గరకు వెళ్ళకత ప్పలేదు. ఆమె కనీసం తలెత్తి కూడా చూడలేదు. డ్రాయర్ సొరుగుమూసి, కుర్చీని వెనక్కునెట్టి లేచి నిల్చుంది. తరువాత సెక్షనాఫీసర్ గదిలోకి విస విసా నడిచి వెళ్ళిపోయింది. కనీసం కొనకంటి చూపైనా ప్రసాదించకుండా. 'తనను గురించి తాను అతిగా అనుకుంటోంది.' అనుకున్నాడు. తనను తను సంభాళించుకుంటూ తన సీట్లో చేరాడు.

ఆ ఆఫీసులో ఎక్కువకాలం ఉండటం కష్టమని పించింది. గతం తాలూకు అవ మానభారం మరిచి పోగలుగు తాడు. కానీ ప్రస్తుతం జరుగు తున్న దానికి అతనికి మనస్తాపం ఎక్కువయింది. ఆఫీసు కొలీగ్స్‌కు తన గతానుభవం తెలిసి ఎక్కడ తనను చులకనగా చూస్తారోననే భయం వేధించసాగింది.

పైగా ఆడవాళ్ళదగ్గర రహ స్యం దాగదైపోయె. ఇటువంటి రసవత్తరమైన విషయం తెలిస్తే సహోద్యోగులకు మహదానందం కలగకమానదు. పుకార్లపై వారికి మక్కువెక్కువ.

లంచ్, టీ సమయాల్లోనే కాకుండా, ఆఫీసర్‌గారు లేని సమ యాల్లో కూడ, అందరూ ఆమె టేబుల్ దగ్గర చేర్తారు. కొన్నిసార్లు గుసగుసలు, మరికొన్నిసార్లు పెద్ద పెద్దగా మాట్లాడుకుంటారు. వాళ్ళు గుసగుసలాడిన ప్రతిసారి అతను అనుమానంతో సతమత మయ్యేవాడు.

జీవితంలో సాధించాల్సినవి చాలానే ఉంటాయి. పెళ్ళి అనేది పెద్ద గొప్పవిషయమేం కాదు. మొదటిసారి పెళ్ళిచూపులలోనే ఓటమి పాలవటం పెద్దగా పట్టించుకోనవసరం లేదు. కాని ఆ చిన్న ఓటమికైనా, కారణమైన మనిషి ఎదురుగా ఉండటమే. అతనికి ముళ్ళమీద కూర్చున్నట్లనిపిస్తోంది. అందుచేత తోటివాళ్ళతో కలివిడిగా తిరగలేకపోతున్నాడు.

జీవితంలో సాధించాల్సినవి చాలానే ఉంటాయి. పెళ్ళి అనేది పెద్ద గొప్పవిష యమేం కాదు. మొదటిసారి పెళ్ళిచూపులలోనే ఓటమి పాలవటం పెద్దగా పట్టించుకోనవసరం లేదు. కాని ఆ చిన్న ఓటమికైనా, కారణమైన మనిషి ఎదురుగా ఉండటమే. అతనికి ముళ్ళమీద కూర్చు న్నట్లనిపిస్తోంది. అందుచేత తోటివాళ్ళతో కలివి డిగా తిరగలేకపోతున్నాడు.

కొంతమంది అడగనే అడిగారు, తప్పించుకు తిరుగుతున్నావేమని. స్నేహపూర్వకమైన చిరున వ్వొకటి విసిరి దాటిపొయ్యేవాడు. కొలీగ్స్‌తో మాట్లాడకూడదనే నియమమేమీ లేదతనికి. కాని ఆమె తనను ఎప్పుడూ గమనిస్తూనే ఉంటుందనే అనుమానం అతన్ని స్వేచ్ఛగా ఉండనివ్వటంలేదు. ఈ పరిస్థితుల్లో వాళ్ళతో మాట్లాడినా కష్టమే, మాట్లాడకపోయినా కష్టమే. ఎప్పుడైనా అతనామె వైపు చూడటం తటస్థిస్తే, ఆమె ఒక్కోసారి నేరుగా అతణ్ణి చూసేది. మరి కొన్నిసార్లు మొఖం తిప్పుకు నేది. ఒకవేళ ఆమె తనవైపు చూస్తున్నట్లు తను గమ నించగా, తన సీటు పక్కవాళ్లనెవరినో పిలిచేది, అతని కోసం కాదన్నట్లు.

ఇలా ఒకసారి కాదు, రెండుసార్లు కాదు. చాలా సార్లు జరిగింది. తను నేరుగా ఆమె దగ్గరికి పోయి మాట్లాడి ఈ నిశ్శబ్ద వేదనను భంగం చేయవచ్చు. కాని తనెందుకు పోవాలి? ఏం మాట్లాడాలి?

తను పెళ్ళి చూపులకు పోయినప్పుడు కూడా అతను ఆమెతో నేరుగా మాట్లాడలేదు. సాంప్రదా యకంగా ఆమె తండ్రితోనే మాట్లాడాడు. తక్కిన బంధువులతో ఆమె వచ్చి ఎదురుగా కూర్చొన్నా, తను మాత్రం అనవసరంగా ఆమెతో మాట్లాడి ఇబ్బంది కల్గించదల్చుకోలేదు. అమ్మాయికి సంగీతం వొచ్చా? వంటా వార్పు చేతనవునా వగైరా వగైరా లాంటి ప్రశ్నలు వేయ లేదు. పెద్దవాళ్ళు మాట్లాడు కుంటుంటే తను వింటూ కూర్చు న్నాడు. అంతా విని అందరి ముందు తన అంగీకారాన్ని అప్పుడే అక్కడే చెప్పేశాడు. కాని ఆమె తన అనంగీకారాన్ని రెండు రోజుల తర్వాత తండ్రి ద్వారా తెలి పింది.

తన తల్లి అన్నట్లు ఆ అమ్మాయి తల బిరుసుదా? ఆమెలో ఏం ప్రత్యేకతుందని ఆ పొగరుబోతుదనం. అందాల భరిణ కాదు. గొప్పగొప్ప చదు వులు లేవు. ఆస్తిపాస్తులున్నవా అంటే అవీ లేవు. మరెందుకు తను నచ్చలేదు? బహుశా తన అందం ఆమె కంటికి ఆనలేదేమో! ఇలా అనుకుంటే అతని అహం పడగలె త్తేది. అతని అందం గురించి అవ యవపొందిక గురించి ఎవరూ ఏనాడూ కామెంటు చేయలేదు. తన అందాన్ని గురించి అతనికి అంచనా వుంది. వొత్తుగా ఎదిగిన జుత్తు, మెరిసే ముఖం, చ్కని రంగు, అమరిన దుస్తులు, సంస్కారయుతమైన మాటతీరు- తనకేం తక్కువని?

తనకు రాబోయే శ్రీమతికి సుఖసంతోషకరమైన ప్రశాంతమైన జీవితాన్ని అందించాలనుకున్నాడు. జరిగినదానికి నిజంగా నష్టపోయింది తనుకాదు. అయినా అతనామెను గూర్చి ఆలోచించకుండా ఉండలేకపొయ్యాడు. అది అతని పనిలో కూడా ప్రభావం చూపింది. అన్యమనస్కంగా చేయటం మూలాన తప్పులు చేసేవాడు.

ఇలా నెలరోజులు గడిచాయి. జీతాలు తీసుకునే సమయం వచ్చింది. తను కూడా ఆమె చేతులమీద నుండే తీసుకోవాలి? ఈ టెన్షన్ ఎలా భరించాలి? ఆమెకు కూడా తనలాగే టెన్షనుంటుందా? ఇతరుల ఫీలింగ్స్‌కు స్పందించే మనసున్న ప్రతివ్యక్తికీ స్పంద నుంటుంది కాని ఆమెలో అటువంటి భావమున్న దాఖలాలేమీ లేవు. ఆమె ఎలా ఉండగలుగుతోంది? ఇతరులతో మాట్లాడే సమయాల్లోకూడా చాలా చాకచక్యంగా అతని జోక్యం లేకుండా జాగ్రత్తపడు తుంది. ఇంత చిన్నవయసులో ఇంత అందమైన గర్వం!

సాయంత్రం నాలుగు గంటలకు జీతాల చెల్లింపు కార్యక్రమం మొదలైంది. సహోద్యోగు లందరూ ఒక్కరొక్కరుగా ఆమెముందు నిల్చు న్నారు. డబ్బులు లెక్కపెట్టుకుంటూ ఆనందంగా మాట్లాడుకుంటున్నారు. ఆఫీసంతా రెండు నిము షాల్లో ఖాళీ అయింది. చివరగా అతని జీతం ఇవ్వ టానికి మాత్రమే ఆగాలి. లేకపోతే పిలవాలి.

"సార్. ఏమిటో ఆలోచిస్తున్నారు. క్యాషియర్ మేడం గారు మిమ్ములను పిలుస్తున్నారు." అన్నాడు ఆటెండర్.

ఊపిరి గట్టిగా పీల్చి, లేచి ఆమె ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఆమె మామూలుగా అతని జీతమున్న కవరును అందించి "ప్లీజ్ లెక్కపెట్టు కోండి." అన్నది.

అతను లెక్కపెట్టుకోలేదు. అలాగే ఆమె మొఖంలోకి చూస్తూకూర్చున్నాడు. తనను నెలకు పైగా తీరని మనస్తాపానికి గురిచేసి, ఏమీ ఎరుగని నంగనాచిలా కూర్చున్న ఆమెను చూస్తుంటే, అది కోపమో, ద్వేషమో, బాధో, నిర్వీర్యతో తెలియని అయోమయం అతన్ని ఆవహించింది. ఇదంతా ఆమె ఎదురుగా ఉన్నంత కాలం సాగుతూనే ఉంటుంది.

మీరు ఎవరినైనా ప్రేమించారా?" సడెన్‌గా అడి గేశాడు.

ఆశ్చర్యం, షాక్ ముప్పిరిగొనగా "లేదే! ఎందు కు?" అంది వెంటనే.

"మరి అటువంటప్పుడు మీరు ఎందుకలా చేశారు?"

ఆమె స్థాణువైంది. ఇలా అడుగుతాడని ఆమె ఊహించి ఉండదు. కొద్దిగా తలవాల్చి పెన్సిల్‌ను వేళ్ళమధ్య తిప్పుతూ కూర్చుంది.

"సారీ. మీ నుంచి జవాబొస్తుందని ఆశిస్తున్నా ను..."

"ఏం జవాబు?"

"మీరు నన్ను తిరస్కరించటానికి గల బలమైన కారణం?"

ఆమె తన డ్రాయర్ సొరుగుమూసి, లేచి నిల్చుంది. అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది. ఒక నిశ్చయానికి వచ్చినదానిలా ఒక్క సెకండు ఆగి అనింది.

"పెళ్ళి చూపుల సమయంలో తిరస్కరింపబడ టంలోని బాధ, అవమానం తెలియనిదాన్ని కాదు. కాని 'తిరస్కరించటం'లోని ఆనందం ఒక్కసారైనా అనుభవిద్దామనే మిమ్ములను తిరస్కరించాను. అంతే. వేరే కారణంలేదు.

★